కాలువే కదా అని కబ్జా చేశారు!

- కుంచించుకుపోయిన ఊరి మురుగునీటి కాలువ
- ఎవరికి వారు అక్రమ కట్టడాలు
- తేలిక పాటి వర్షానికే రోడ్లన్నీ మురుగు మయం
- అనంతపురం ప్రధాన రహదారిలో మరీ అధ్వానం



కళ్యాణదుర్గంలోని సాయిబాబా ఆలయం వద్ద అక్రమ కట్టడాలతో కుంచించుకుపోయిన మురుగునీటి కాలువ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో మురుగు నీటి కాలువను ఎవరికివారు ఆక్రమించుకొని కబ్జా చేస్తున్నారు. కాలువ స్థలాన్ని ఆక్రమించుకుని ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసి కాలువ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఊరి మురుగు నీటి కాలువ కుంచించుకుపోయింది. తేలిక పాటి వర్షం వస్తే చాలు మురుగునీరంతా రోడ్లపై చేరడంతో జనం ఛీదరించుకుంటున్నారు.

కుంచించుకుపోయిన ఊరి మురుగు కాలువ..

కళ్యాణదుర్గం పట్టణంలోని మురుగు నీరంతా రాయదుర్గం బైపాస్ రోడ్డులోని సుబేదారు చెరువులోకి చేరుతోంది. ఈ క్రమంలో పట్టణం పైభాగంలో ఉన్న వడ్డే కాలనీ, రాచప్పబావి వీధి, సిద్దప్ప వంక, ఎర్రనేల వీధి, కుమ్మరవీధి, వడ్డే కాలనీ, మారెంపల్లి, పార్వతీ నగర్ మీదుగా మురుగునీరంతా ఒకే కాలువ వెంట ప్రవహిస్తోంది. దీంతో కాలువ కుంచించుకుపోయి మురుగునీరు మొత్తం రోడ్లలోకి ప్రవహిస్తోంది.

వంక పొరంబోకులో ఎవరికి వారు అక్రమ కట్టడాలు..

వంక పొరంబోకు స్థలంలో ఎవరికి వారు అక్రమ కట్టడాలు చేపట్టారు. వాస్తవానికి మారెంపల్లి పై భాగం నుంచి మొదలయ్యే కాలువ ప్రారంభం నుంచి సుమారు 40–50 అడుగుల మేర ఉండేది. కాలక్రమేనా కాలువ ఇరువైపులా ఆక్రమణదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో కాలువ పూర్తిగా కుంచించుకుపోయింది. మారెంపల్లి నుంచి అనంతపురం ప్రధాన రహదారిలో కేవలం 4 అడుగులు మేర కూడా కాలువ లేకపోవడం గమనార్హం.



మారెంపల్లి వద్ద కంపచెట్లు, అక్రమ కట్టడాలతో నిండిన మురుగునీటి కాలువ

ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న మురుగునీటి కాలువ మారెంపల్లి వీధి మధ్యలోనిది. కళ్యాణదుర్గం పై భాగం నుంచి మురుగునీరు ఈ కాలువ గుండానే రాయదుర్గం బైపాస్ రోడ్డులో ఉన్న సుబేదారు చెరువులోనికి చేరాల్సి ఉంది. అయితే కంపచెట్లు ఏపుగా పెరగడం, ఇరువైపులా అక్రమ కట్టడాలు కట్టడంతో సుమారు 50 అడుగుల మేర ఉన్న కాలువ కేవలం 10 అడుగులు మాత్రమే పరిమితమైంది. దీంతో మురుగునీరు కాలువ వెంట వెళ్లేందుకు అడ్డంకిగా మారింది.



సాయిబాబా గుడి ఎదురుగా అనంతపురం ప్రధాన రహదారిలో నిల్వ ఉన్న మురుగునీరు

ఇక్కడ కనిపిస్తున్నది నీటి కుంట కాదు..కళ్యాణదుర్గంలోని సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి ఇది. తేలికపాటి వర్షం వస్తే చాలు పట్టణంలోని ఉన్న మురుగునీరంతా ఒకేసారి ఇక్కడికి వచ్చేస్తుంది. దీంతో ఒక్కసారిగా నడుంలోపు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ ఆగిపోతాయి. ఇందుకు కారణం 50 అడుగుల వెడల్పు ఉండాల్సిన మురుగునీటి కాలువ ఇక్కడ కేవలం 4 అడుగులు ఉండటమే. దీంతో సమీపంలోని స్థానిక ఇళ్లల్లోకి మురుగునీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై పరిశీలిస్తాం

పట్టణంలో మురుగునీటి కాలువ ఆక్రమణ మా దృష్టికి వచ్చింది. టౌన్ ప్లానింగ్ అధికారులతో అక్రమ నిర్మాణాలపై పరిశీలిస్తాం. కాలువ వాస్తవ వెడల్పు ఎంత ఉందనేదానిపై పరిశీలిస్తాం. ఆక్రమణ చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టి ఉంటే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఇన్‌చార్జ్ కమిషనర్, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడులో రైతు కుటుంబాల సంక్షేమం కోసం జైకిసాన్ ఫౌండేషన్–సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లిఓబుళేసు, కానిస్టేబుళ్లు రాము,సిద్దార్థ తదితరులు హాజరై ప్రారంభించారు. అనంతరం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు ఉచిత కం టి వైద్యపరీక్షలు నిర్వహించారు. 70 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 15 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్ రఫీక్, సత్యసాయి సేవా సమితి సభ్యులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సూర్యదేవాలయాన్ని దర్శించుకున్న ఆర్కరిషి మహాగురువు



సూర్యదేవాలయం వద్ద మహాగురువు అర్కరిషి గురువు

ఉరవకొండ: రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయంగా ప్రసిద్ధిగాంచిన బూదగవి సూర్యదేవాలయాన్ని ప్రముఖ అర్కరిషి మహాగురువు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిరంజీవి, మహేంద్రగౌడ్, సుధాకర్‌లు మహాగురువు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని మహాగురువు దర్శించుకొని అక్కడే ఉన్న భక్తులకు సూర్యనారాయణస్వామి వారి విశిష్ఠతను తెలియజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



స్వామీజీకి జ్ఞాపికను అందిస్తున్న యాదవులు

రాయదుర్గం(డి హీరేహాళ్): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని యాదవ మఠాధిపతులు బసవ రామనంద, కృష్ణయాదవానంద స్వాములు తెలిపారు. ఆదివారం డి హీరేహాళ్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలోకి యాదవుల ఆరాధ్యదైవం శ్రీ కృష్ణ భగవానుడి యంత్ర విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి కృష్ణ భగవానుడికి వివిధ పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం. వన్నూరుస్వామి, జాజరకల్లు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బళ్లారి గాదెప్ప హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం తాలూక అధ్యక్షులు మల్లికార్జున, సురేష్‌యాదవ్, హనుమంతప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, కృష్ణమూర్తి, మంజునాథ, మల్లికార్జున, రమేష్, కాంతారాజ్, నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాగరాజు సేవలు మరువలేనివి

కళ్యాణదుర్గం రూరల్: వార్డెన్ నాగరాజు సేవలు మరువలేనివని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి పయ్యావుల కేశవ్ చేతులమీదుగా వార్డెన్ నాగరాజు ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఆదివారం పట్టణంలోని షాదీమహల్‌లో నాగరాజును మాదిగ ఉద్యోగుల సమాఖ్య తాలూక కమిటీ సభ్యులు సన్మానించారు. తాలూక అధ్యక్షుడు ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడు తిప్పే స్వామి, తాలూక ఎస్సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



నేలకొరిగి ప్రహరీపై పడిన భారీ వృక్షం

కంబదూరు: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ పంటలు నీట మునిగి రూ.లక్షలు నష్టం వాటిల్లింది. భారీ వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూఎస్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఓ భారీ వృక్షం నేలకొరిగింది.ఆ చెట్టు కొమ్మలు సమీపంలోని ఇళ్ల ప్రహరీలపై పడ్డాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం కలిగింది.

ఇసుక టిప్పర్ సీజ్

రాయదుర్గం(డి హీరేహాళ్): కర్ణాటకకు ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆదివారం తెలిపారు. టిప్పర్ ఓబుళాపురానికి చెందిన గవిసిద్దప్పదిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన రంగయ్య



వధూవరులతో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య

కూడేరు: మండల పరిధిలోని కలగళ్లలో పోస్టుమాన్ నాగేంద్ర కుమారుడు జగదీష్ వివాహం రజితతో ఆదివారం జరిగింది. వివాహ వేడుకకు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయ కర్త తలారి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



శ్రీకాంత్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామంలో గుండెపోటుతో పూసల శ్రీకాంత్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి భూపసముద్రానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో సర్పంచులు అనిల్ కుమార్, రమేష్, మండల కన్వీనర్ గొని లక్ష్మీకాంతారెడ్డి, నాయకులు ఆర్టీ లక్ష్మీకాంతారెడ్డి, గంధవీడి తిప్పేస్వామి, జగదీష్, చెరువుదొడ్డి రంగప్ప, అంజి, శంకర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి బాధితులకు న్యాయం చేయడంలో విఫలం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కూడేరు: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న పార్చ్యూన్ అనంత అగ్రిగోల్డ్ భూములను అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాల నాగేశ్వర రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ భూములు రోజు రోజుకూ అన్యాక్రాంతమవుతూనే ఉన్నాయన్నారు. అగ్రిగోల్డ్ భూములను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. కూడేరు మండల పరిధిలో పార్చ్యూన్ అనంత అగ్రిగోల్డ్‌లో 221 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో ప్లాట్లు వేయడంతో కొందరు కొనుగోలు చేశారని,మరికొందరు ఆక్రమించుకున్నారన్నారు.రూ.కోట్లు విలువజేసే భూములను ప్రభుత్వం అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బత్తలపల్లి మండలంలో నిడిమామిడిలో రూ.కోట్లు విలువజేసే భూములను బినామీ పేర్లతో కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ భూములను కాపాడడానికి అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు గాను ఈ నెల 28న అమరావతిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర్, జిల్లా అధ్యక్షులు నారాయణప్ప, గౌరవ అధ్యక్షుడు నారాయణ స్వామి, సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, వ్యకాసం జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, మండల నాయకులు రమణ, పెరుగు సంగప్ప, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నీట మునిగిన పంటలు



యాటకల్లువద్ద వర్షపునీటిలో మునిగిన వేరుశనగ పంట



వజ్రకరూరు సమీపంలో పంట పొలంలోకి చేరిన వర్షపునీరు

శెట్టూరు: మండలంలో కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీటి మునిగాయి. యాటకల్లు సర్పంచ్ ఈరన్న చెందిన సుమారు ఐదెకరాలు వేరుశనగ పొలంలోకి వర్షపునీరు చేరింది. అదే గ్రామానికి చెందిన చిత్తయ్యకు చెందిన మూడు ఎకరాల టమాట పంట వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. ఐదుకల్లు గ్రామంలో రైతు వసంత అనే రైతుకు చెందిన మూడు ఎకరాల టమాట పంట మొత్తం నీటమునిగింది. అనుంపల్లి చెరువు వర్షం నీటితో నిండింది. కైరేవు, చింతర్లపల్లి, కనుకూరు, తదితర గ్రామాలలో చెక్‌డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి.

వజ్రకరూరులో భారీవర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. భారీవర్షం కురవడంతో గ్రామ సమీపంలో ఉన్న బావులు, కుంటలు నిండి ప్రవహించాయి. భారీవర్షం కురవడంతో వజ్రకరూరులోని కాలనీల్లో వర్షపునీరు పెద్ద ఎత్తునమెయిన్‌రోడ్‌మీదుగా చెట్టుకుంటవైపు ప్రవహించాయి. భారీ వర్షంతో బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగనున్నట్లు రైతులు తెలిపారు.

ముగిసిన కేపీఎల్ క్రికెట్ పోటీలు

కళ్యాణదుర్గం రూరల్: కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ పోటీలు ముగిశాయి. మొత్తం ఎనిమిది జట్లకు 32 మ్యాచ్‌లు నిర్వహించారు. ఆదివారం సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించారు. మంత్రి సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఆర్‌డీఓ రాణీసుస్మిత హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో గరుడ జ్ఞానభారతి, కార్తీక్ కింగ్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కార్తీక్ కింగ్స్ జట్టు 69 పరుగులు చేసింది. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన గరుడ జ్ఞానభారతి జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 67 పరుగులకే ఓటమిపాలైంది. విజేత కార్తీక కింగ్స్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ. 2లక్షల చెక్కు అందించారు. రన్నర్ జట్టుకు గరుడ జ్ఞానభారతి జట్టుకు ట్రోఫీతో పాటు రూ.లక్ష చెక్కు అందించారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ట



కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శ్రీవారి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణ నడుమ అర్చకులు స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం స్వామికి పంచామృతాభిషేకం, అర్చక, తులసీ అర్చన నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులు ఆలయానికి పోటెత్తారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు.

నీలగిరిస్వామి ఆలయంలో పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో వెలసిన నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు చేశారు.

పశు బీమా చేసుకోండి

కూడేరు: పశు పోషకులు , రైతులు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పంట బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. నాటీ ఆవులు, గేదెలు, ఎద్దులకు రూ.15 వేలు బీమాకు రూ.200 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. సంకరజాతి ఆవు , గేదెలకు రూ.30 వేలు బీమాకు రూ.400 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెలాఖరులోపు ప్రీమియం చెల్లించుకోవాలని, మరింత సమాచారం కోసం ఆస్పత్రికి వచ్చి సంప్రదించాలని ఆయన సూచించారు.

దోషులను శిక్షించాలి

శెట్టూరు: కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని ఆర్డీటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఆదివారం రాత్రి ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మహిళా సంఘాల సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ సుశీలమ్మ, సీబీటీ వన్నూరుస్వామి, హనుమక్క, అంజినమ్మ, నాగమ్మ, వన్నూరక్క, సువర్ణమ్మ, సుజాతమ్మ, అనుసూయ పాల్గొన్నారు.

భారీ వర్షంతో పంటలకు ఊరట



ఉదిరిపికొండ వద్ద పచ్చపడిన కంది పంట



ముద్దలాపురం వద్ద పచ్చగా కనిపిస్తున్న ఆముదం పంట

కూడేరు: మండలంలో నాలుగు రోజులుగా 15 మిల్లీ మీటర్లు, 21 మిల్లీ మీటర్లు, 26 మిల్లీ మీటర్లు, 19 మి.మీ చొప్పున వర్షం కురిసింది. వర్షంతో ఎండుముఖం పట్టిన పంటలకు ఊపిరి వచ్చినట్లయ్యింది. మండలంలో జూన్ నెలలో మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్‌లో ముందస్తుగా సుమారు 1500 ఎకరాల్లో వేరుశనగ, 1200 ఎకరాల్లో ఆముదం, 300 ఎకరాల్లో కంది సాగు చేశారు. విత్తినప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదు. దీంతో నేలలో తేమ లేక సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. రూ.వేలుపెట్టుబడి పెట్టి, సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండుతుంటే రైతులుఆందోళన చెందేవారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో పంటలకు ఊపిరి వచ్చినట్లయ్యింది.

విక్రయానికి గణనాథుల ప్రతిమలు రెడీ




కూడేరు వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు

రాయదుర్గంటౌన్/కూడేరు: పట్టణంలో వినాయక సందడి మొదలైంది. వచ్చే నెలలో వినాయక చవితి జరగనుంది. ఇప్పటి నుంచే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గణనాథుల విగ్రహాల విక్రయానికి సిద్ధంగా ఉంచారు. పలుచోట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. రాయదుర్గంలోని బళ్లారి రోడ్డు మిట్ట వద్ద కోల్‌కత్తాకు చెందిన కళాకారులు భారీ సైజు మట్టి గణపతుల ప్రతిమలను విక్రయానికి అత్యధిక సంఖ్యలో తయారు చేస్తున్నారు. అనంతపురం రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రాజస్థానీలు ప్రతిమలను విక్రయానికి ఉంచారు. బళ్లారి జిల్లా రూపనగుడి ఇతర ప్రాంతాల నుంచి కళాకారులతో పాటు ఇతర తయారీదారులు తయారైన గణనాథుల విగ్రహాలు, ప్రతిమలు అమ్మకానికి ఉంచారు.

కూడేరులో విక్రయానికి సిద్ధంగా ...

కూడేరులో కుమ్మర రమేష్ గత 8 నెలలుగా విగ్రహాలను తయారు చేస్తు వస్తున్నారు. వివిధ రకాల డిజైన్లతో వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా విగ్రహాలను తయారు చేస్తున్నాడు. 3 అడుగుల నుంచి 13 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారు చేశాడు. 3 అడుగులవి రూ.3500 , 10 అడుగులవి రూ.15 వేలు, 13 అడుగల విగ్రహాలు రూ.20 వేలు చొప్పున ధరలు నిర్ణయించినట్లు విగ్రహాల తయారీ రమేష్ తెలిపారు. కూడేరులోను, కళ్యాణదుర్గం, అనంతపురం, ఇతర ప్రాంతాలకు విగ్రహాలను తరలించి విక్రయించుకొని సొమ్ము చేసుకుంటానన్నారు.


హెచ్చెల్సీ బ్రిడ్జిలను మరమ్మతు చేయండి




నాగేపల్లి వద్ద దుస్థితిలోని హెచ్చెల్సీ బ్రిడ్జిని సందర్శించిన సీపీఐ నాయకులు

కణేకల్లు: హెచ్చెల్సీపై ఉన్న బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకొని అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయని రాయదుర్గం తాలుకా సీపీఐ కార్యదర్శి నాగార్జున అన్నారు. హెచ్చెల్సీపై దుస్థితిలో ఉన్న బ్రిడ్జిలను సీపీఐ నాయకులు ఆదివారం సందర్శించారు. కణేకల్లు మండలంలో మాల్యం, నాగేపల్లితోపాటు బొమ్మనహాళ్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో హెచ్చెల్సీ బ్రిడ్జిలు దుస్థితికి చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఈ బ్రిడ్జిలపై ప్రత్యేక దృష్టిసారించి, కొత్త బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. మరమ్మతుకు నోచుకోని వివిధ రోడ్లకు మరమ్మత్తులు చేయాలన్నారు. సొల్లాపురం–పెనకలపాడు మార్గమధ్యంలో పెనకలపాడు శివారులో బ్రిడ్జి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజినేయులు, మల్లప్ప, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


కనులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



మహావరుణయాగం నిర్వహిస్తున్న పండితులు

- ఆలయంలో వరుణయాగం
- భారీగా తరలివచ్చిన భక్తులు

ఉరవకొండ: స్థానిక పదోవార్డు భద్రప్పబావి వీధిలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సహిత శ్రీనివాసుడి ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణలతో అలంకరించి, కల్యాణోత్సవానికి ముస్తాబు చేశారు. అనంతరం 12.15 గంటలకు అభిజిత్ లగ్నం నందు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. గోవిందా..గోవిందా నామస్మరణతో ఆలయం మార్మోగింది.

ఆలయంలో మహా వరుణయాగం: వర్షాలు సకాలంలో కురిసి పంటలు చేతికంది రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ వేదపండితుల ఆధ్వర్యంలో మహా వరుణయాగం నిర్వహించారు. దీంతో పాటు నారాయణ, గణేష, కుబేర హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.